రంఛనుగా జీతాలు



ప్రభుత్వ ఉద్యోగులకు రంఛన్‌గా గురువారం జీతాలు పడ్డాయి. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం.. ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ ఉద్యోగులకు జూలై నెలలోనూ ఒకటో తేదీనే జీతాలు జమ చేశారు. దీనిపై ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆనందం నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో జీతాలు ఒకటో తేదీనే వద్ద దాఖలాలు లేవు. ఏ తేదీన జీతాలు వస్తాయో తెలియని పరిస్థితి గత ఐదేళ్లలో నెలకొంది. అలాంటిది కూటమి ప్రభుత్వం గత రెండు నెలలుగా రంఛన్‌గా జీతాలు జమచేసింది. జిల్లాలో 98 ప్రధాన ప్రభుత్వశాఖల్లో 25,784మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరికీ గురువారం ఉదయం నుంచి ఎస్బీఐ తప్ప మిగిలిన బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన ఉద్యోగులందరికీ విడతలవారీగా జీతాలు పడుతున్నాయి. ఖజానా, రెవెన్యూ, జుడీషియల్, మెడికల్, పోలీసు, సచివాలయ తదితర శాఖల ఉద్యోగులకు మాత్రమే గతంలో ఒకటో తేదీన జీతాలుపడుతుండగా, మిగిలిన వారికి ఆ నెలలో 15వ తేదీవరకు జమయ్యేది.

● కాగా, జిల్లాలోని 12,505 మంది ప్రభుత్వ పెన్షనర్లకు కూడా గురువారం రాత్రంతా పింఛన్లు పడుతున్నాయి.

- చిత్తూరు కలెక్టరేట్

ఒకటో తేదీ అనగానే గుర్తుకొచ్చేది జీతం.. పింఛన్లు. వైసీపీ అధికారంలోకి రాకముందు వరకు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు.. విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు ఒకటో తేదీన వచ్చేవి. జగన్ వచ్చాక ఒకటో తేదీని మరచిపోయారంతా. అసలు, జీతం ఫలానా తేది వస్తుందని చెప్పలేని పరిస్థితి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక.. రెండో నెలలోనూ ఒకటో తేదీనే దాదాపుగా జీతాలు జమవడం గమనార్హం. మరోవైపు వలంటీర్లు లేకున్నా సచివాలయ సిబ్బందితో సామాజిక పింఛన్లూ ఇళ్ల వద్దకు తీసుకొచ్చి పంపిణీ చేశారు.

తెల్లవారుతుండగానే... పింఛన్ల పంపిణీ

● సచివాలయ ఉద్యోగుల ద్వారా 97.82 శాతం పూర్తి



పుంగనూరులో మంచంపై ఉన్న వృద్ధురాలి ఇంటికెళ్లి పింఛను పంపిణీ చేస్తున్న కమిషనర్ నరసింహాప్రసాద్‌రెడ్డి



పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లెలో ఉదయం 4 గంటలకే పింఛను ఇస్తున్న సచివాలయ ఉద్యోగి

చిత్తూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుతుండగానే సచివాలయ ఉద్యోగులు ఇళ్ల తలుపు తట్టారు. బయోమెట్రిక్ వేసి అవ్వాతాతల చేతిలో రూ.4 వేలు చొప్పున పింఛను డబ్బులు పెట్టారు. వలంటీర్లు లేకుంటే అవ్వాతాతలకు ఇళ్ల వద్దకు పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదని, టీడీపీ గెలిస్తే పింఛన్లకు ఇబ్బంది పడాల్సి వస్తుందంటూ ఎన్నికల ముందు వైసీపీ తీవ్ర ప్రచారం చేసింది. కానీ, కూటమి అధికారంలోకి వచ్చాక రెండో నెలలోనూ (ఆగస్టు ఒకటో తేది) ఉదయాన్నే సచివాలయ ఉద్యోగులు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మొదలు పెట్టారు. కొందరైతే వేకువజామున 4 గంటలకే గ్రామాల్లో పంపిణీ ప్రారంభించారు. అవ్వాతాతల ఇళ్ల వద్దకే వెళ్లి ఇచ్చారు. జిల్లాలో తొలిరోజు 97.82 శాతం పంపిణీ పూర్తి చేశారు. మిగిలిన వారికి శుక్రవారం అందించనున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తమ ప్రాంతాల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు రూరల్ మండలంలో పాల్గొన్నారు. చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, నగరి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, థామస్, మురళీమోహన్, గాలి భానుప్రకాష్. తమ తమ నియోజకవర్గాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

చిత్తూరు (సెంట్రల్): ఎన్టీఆర్ భరోసా కింద జిల్లాలోని 2,70,619 మందికిగాను రూ.114.10 కోట్ల పంపిణీ చేపట్టారు. తొలిరోజున 2,60,671 మందికి రూ.109.88 కోట్లు పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఒకటి రెండు రోజుల్లో నేరుగా పింఛను అందజేయనున్నారు.



సార్, సంతోషంగా ఉంది

పింఛనును రూ.నాలుగు వేలకు పెంచి ఇవ్వడంపై చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లెలో చిన్నబ్బ ఆనందం వ్యక్తంచేశారు. గురువారం పింఛన్ల పంపిణీ సందర్భంగా పెంచి పింఛను విషయమై కలెక్టరు సుమిత్‌కుమార్ ప్రస్తావించారు. దీనికి ఆయన సంతోషంగా ఉందంటూ గౌరవంగా వంగి.. కలెక్టర్ చేతిని పట్టుకుని తన ముఖాన్ని ఆనించారు. తద్వారా తన అభిమానం.. ఆనందాన్ని వ్యక్తపరిచారు.

- చిత్తూరు

ఐసీయూలో రోగికి ఎన్టీఆర్ భరోసా



వెదురుకుప్పం మండలం మారేపల్లికి చెందిన ఎర్రసాని భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్‌లో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ ఉద్యోగి పుష్ప స్విమ్స్‌కు వెళ్లి ఆయన వేలి ముద్ర సేకరించి కుటుంబీకులకు పింఛను సొమ్ము అందించారు. అత్యవసర చికిత్స సమయంలో పింఛను సొమ్ము అందడంతో ఆ కుటుంబీకులు సంతోషం వ్యక్తంచేశారు.

- వెదురుకుప్పం

రిజిస్ట్రేషన్ భవనాల స్థితిగతులపై నివేదిక ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: కాలం చెల్లిన అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తాజా స్థితిగతులపై 10 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎంపిక చేసిన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాలుగు కూలే స్థితిలోని భవనాల్లో కొనసాగుతుండగా, మరో నాలుగు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రెవిన్యూ, రిజిస్ట్రేషన్ వంటి ముఖ్య శాఖలకు సంబంధించిన కార్యాలయాల్లో నిల్వ ఉన్న ముఖ్య డాక్యుమెంట్లు, ఫైళ్లు భద్రపరచుకోవాల్సి ఉందన్నారు. విద్యుత్ వైరింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, రికార్డు రూముల మరమ్మతులు, భద్రతా ప్రమాణాలు చేపట్టేందుకు నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి, ఆర్ అండ్ బీ డీఈఈ దస్తగిరి పాల్గొన్నారు.

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం గత నాలుగు నెలల్లో భారీగా తగ్గింది. లక్ష్యంలో 56శాతమే సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు వసూళ్ల లక్ష్యం రూ.74.33 కోట్లు కాగా, ఇందులో రూ.41.18 కోట్లు మాత్రమే వృద్ధి సాధించింది. దీంతో వృద్ధిరేటు భారీగా పడిపోయింది. నాలుగు నెలల్లో 18వేల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గత నాలుగు నెలల కాలానికి 50 శాతం మాత్రమే వృద్ధి సాధిస్తే, ఈ ఏడాది 56శాతం మాత్రమే జరిగింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం, భూసర్వే తదితర కారణాలతో వసూళ్ల లక్ష్యం తగ్గినట్లు సమాచారం. వీటితో పాటు ఎన్నికల సమయంలో పెద్దమొత్తాల నగదుతో ప్రయాణం ఇబ్బందిగా మారడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కక్షిదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వేచిచూసే ధోరణి అవలంబించడం కూడా కారణాలుగా మారాయి.

ఎమ్మెల్సీ భరత్‌కు నిరసన సెగ

● అడ్డుకునే ప్రయత్నం చేసిన టీడీపీ శ్రేణులు



వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలతో భరత్ సమావేశం

రామకుప్పం, ఆగస్టు 1: 'అధికారంలో ఉన్న ఐదేళ్లు కుప్పం నియోజకవర్గం అభివృద్ధిని పట్టించుకోలేదు. అరాచక శక్తులకు అండగా నిలిచారు. విపక్షాలు, జనాన్ని భయాందోళనల్లోకి నెట్టారు' అంటూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్‌ను టీడీపీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో రామకుప్పం శివారులోని ఆకందగానిపల్లెలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. నెల రోజులుగా భరత్ కుప్పానికి దూరంగా ఉన్నారు. కుప్పం మున్సిపల్ కౌన్సిలర్లు, మూడు మండలాలకు చెందిన పలువురు ఎంపీటీసీలు బుధవారం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ క్రమంలో నష్టనివారణ చర్యలకు ఆయన ఉపక్రమించారు. గురువారం ఉదయం ఆకందగానిపల్లెలోని వైసీపీ నేత చంద్రారెడ్డి గెస్ట్ హౌస్ ఆవరణలో మండలంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమయ్యారు. ఎవరూ పార్టీని వీడొద్దంటూ బుజ్జగించినట్టు తెలిసింది. ఈ సమావేశం విషయం తెలిసి తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, యూనిట్ ఇన్‌చార్జులు గజేంద్ర, వెంకటరమణ, నేతలు సుబ్రీ, బాలరాజు, ఆదిల్, సతీష్, అవినాశ్, మంజునాథ్, నవీన్, సురేష్, కార్యకర్తలతో కలిసి అక్కడికి చేరుకున్నారు. 'భరత్ గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. గెస్ట్‌హౌస్‌లోకి చొచ్చుకెళ్లడంతో భరత్ సమావేశాన్ని ముగించి.. గెస్ట్‌హౌస్ లోపలకు వెళ్లిపోయారు.

ఎమ్మెల్సీ భరత్ బయటకు రావాలంటూ వారు నినదించారు. వైసీపీ నేత చంద్రారెడ్డితో వాగ్వాదానికి దిగారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, రాళ్ళబూదుగూరు ఎస్ఐ నరేష్ పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. భరత్‌తో తాము మాట్లాడాలని, ఆయన్ను వెలుపలకు తీసుకురావాలని టీడీపీ నేతలు భీష్మించుకున్నారు. తనకు చెబితే ఆ విషయాలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళతానని సీఐ చెప్పారు. ప్రశాంత కుప్పంలో రాజకీయ కక్షలకు తెరలేపి, టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలనూ ఇబ్బంది పెట్టిన ఎమ్మెల్సీకి నియోజకవర్గంలో పర్యటించే అర్హత లేదన్నారు. ఈ విషయాలను భరత్ దృష్టికి తీసుకెళ్తానని సీఐ చెప్పడంతో వారు వెనుదిరిగారు.



ఆకందగానిపల్లె వద్ద గుమికూడిన టీడీపీ శ్రేణులు

భరత్‌ను అడ్డుకోవడం తథ్యం

అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుప్పం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ భరత్ ఐదేళ్లు అరాచకాలు సృష్టించారని, ఆయన నియోజకవర్గంలో ఎక్కడ పర్యటించినా తమ పార్టీ కార్యకర్తలు అడ్డుకోవడం తథ్యమని టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. అరాచకశక్తులతో అంటకాగిన ఆయన.. అరాచకాలను ప్రశ్నించిన వందలాది మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు, సామాన్యజనంపై దాడులు చేయించి.. అక్రమ కేసులూ బనాయించారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటించిన ప్రతిసారీ వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి అడ్డంకులు సృష్టించారన్నారు. తమ పార్టీ నేతలతో చంద్రబాబును పరుషపదజాలంతో దూషింపజేయడమేకాకుండా, బాంబులు వేస్తామని బెదిరింపజేశారన్నారు.కుప్పం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం కొనసాగాలన్నా,అభివృద్ధి పరుగులు తీయాలన్నా భరత్ వంటి వ్యక్తులు ఉండరాదని ప్రజలు కూడా భావిస్తున్నారన్నారు. కుప్పం అభివృద్ధిని కాంక్షించి వైసీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, ముఖ్యనేతలు టీడీపీలో చేరుతున్నారన్నారు. త్వరలోనే కుప్పం నియోజకవర్గంలో వైసీపీ దుకాణం బంద్ అవుతుందన్నారు.

టీడీపీకే.. స్టాండింగ్ కమిటీ

● చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో వాగ్వాదాల మధ్య ముగిసిన ఎన్నిక
● పోలింగ్‌ను బహిష్కరించిన వైసీపీ కార్పొరేటర్లు
● నిబంధనల ప్రకారం ఎన్నిక నిర్వహించామన్న పీవో



గెలుపొందిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే



నగరపాలక కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ కార్పొరేటర్లు, విజయానందరెడ్డి తదితరులు

చిత్తూరు, ఆగస్టు 1: చిత్తూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీని టీడీపీ కూటమి కైవసం చేసుకుంది. ఇప్పటికే ఇక్కడి పాలకవర్గం టీడీపీ చేతిలో ఉండగా.. తాజాగా గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ సభ్యులే విజయం సాధించారు. టీడీపీ తరపున ఐదుగురు, వైసీపీ తరపున ముగ్గురు సభ్యులు పోటీలో నిలిచారు. టీడీపీ సభ్యులైన ఐదుగురికీ పూర్తి మెజారిటీ రావడంతో వారి గెలుపును ఎన్నికల అధికారి, కమిషనర్ అరుణ ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఎన్నికల్ని నిర్వహించలేదని ఆరోపిస్తూ వైసీపీ కార్పొరేటర్లు పోలింగ్‌ను బహిష్కరించి, కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

చిత్తూరు నగరపాలక సంస్థలో ఐదుగురు సభ్యుల స్టాండింగ్ కమిటీకి ఎనిమిది మంది పోటీ చేయడంతో గురువారం పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల అధికారి, కమిషనర్ అరుణ, పీవో, ఓపీవోలతో కలిసి కౌన్సిల్ హాలులో స్టాండింగ్ కమిటీకి సంబంధించి వివరాలను సభ్యులకు వివరించారు. ఐదుగురు సభ్యులున్న కమిటీకి ఎనిమిది మంది పోటీలో ఉన్నారని, సభ్యులంతా ఐదుగురికే ఓటు వేయాలని సూచించారు. కౌన్సిల్ హాలులో పోలింగ్ బూత్ ఉండటంతో సభ్యులంతా బయటికి వెళ్లి క్యూలైన్‌లో మేయర్ చాంబర్ వద్ద బ్యాలెట్ పత్రాలను తీసుకుని కౌన్సిల్ హాలులోకి వచ్చి ఓటు వేయాలని సూచించారు. దీనిని వైసీపీ కార్పొరేటర్లు వ్యతిరేకించారు. 'కౌన్సిల్ హాలులోనే సభ్యుల పేర్లను పిలిస్తే బ్యాలెట్ పత్రాలను తీసుకుని సీక్రెట్‌గా ఏర్పాటు చేసిన తెర లోపల ఓటు వేస్తామని, అలా కాకుండా బయటి నుంచి రమ్మని చెప్పడం సరికాదని' అభ్యంతరం తెలిపారు. దీంతో కమిషనర్‌కు, వైసీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. బయటి నుంచి క్యూలైన్‌లో వస్తేనే ఓటింగ్‌కు అనుమతిస్తామని కమిషనర్, పీవో చెప్పడంతో పోలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వైసీపీ కార్పొరేటర్లు చెప్పి బయటికి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయానందరెడ్డి నగరపాలక కార్యాలయానికి చేరుకున్నారు. కార్పొరేటర్లతో కలిసి కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఇదిలా ఉండగానే టీడీపీ కార్పొరేటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ సమయం ముగిసిన ఏజెంట్ల సమక్షంలో అనంతరం పీవో, ఏపీవోలు లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. టీడీపీ సభ్యులకు అవసరమైన పూర్తి మెజార్టీ దక్కింది. నిర్మల, రాజేష్‌కుమార్‌రెడ్డి, శశికుమార్, సుష్మకు 29 చొప్పున, అశోకన్‌కు 28 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఈ ఐదుగురిని స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికల అధికారి అరుణ ప్రకటించారు. వైసీపీ సభ్యులు చంద్రశేఖర్, మధుబాబు, శోభ పోటీ చేయగా.. చంద్రశేఖర్‌కు మాత్రం ఒక్క ఓటు పడింది. కాగా, స్టాండింగ్ కమిటీ ఎన్నికలో విజయం సాధించిన వారిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అభినందించారు. నగరాభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని వెళుతున్నామని, ఎన్నికల్లో మద్దతునిచ్చిన వారందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేషకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ పోలింగ్ సందర్భంగా వైసీపీ కార్పొరేటర్లు అధికారులతో వాగ్వాదం చేస్తుండగా.. మరోవైపు ఓట్లు వేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

కమిషనర్ అరుణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణ తీరు నచ్చక కమిషనర్ అరుణపై వైసీపీ కార్పొరేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డితో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో కమిషనర్ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఆమె తీరు గురించి కలెక్టర్‌కు వివరంగా చెప్పామని, మున్సిపల్ శాఖ డైరెక్టర్ హరినారాయణన్‌కు కూడా మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపామన్నారు.

లోకేష్ అన్నా... పేద పిల్లల ఆకలి తీర్చండి



- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 23వేల మంది విద్యార్థులకు లబ్ధి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తారనే ఆశతో పేద విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలులో ఉన్న ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే జగన్ రద్దు చేసేశారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ కాలేజీల్లో ఈ పథకం తిరిగి ప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ కూడా ఇచ్చారు.

- తిరుపతి(విద్య)

పేద పిల్లలకు ఇది అవసరం

మధ్యాహ్న భోజనం లేనందువల్ల హాజరు శాతం తగ్గుతోంది. కొంతమంది మధ్యాహ్న భోజనంకోసం ఇళ్లకు వెళ్లినవారు తిరిగి కళాశాలలకు రావడంలేదు. అలాగే డ్రాపౌట్స్ కూడా పెరుగుతున్నారు. మధ్యాహ్న భోజనం అమలుచేస్తే ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయి.



- రవి, జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మా ఆకలి తీర్చండి



ఉదయం కళాశాలకు వచ్చినప్పటినుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు భోజనం లేకుండా ఆకలితో ఉండాల్సి వస్తోంది. దీంతో చదవుపై దృష్టి సారించలేకపోతున్నాం. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే పేద, గ్రామీణ విద్యార్థులకు ఎంతో మేలు చేసినవారవుతారు.

- ఏఎస్ మోహన్‌కుమార్, ఎంపీసీ ద్వితీయ, పుత్తూరు

చాలామంది బాక్స్‌లు తెచ్చుకోలేరు

చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థుల్లో చాలామంది లంచ్ బాక్స్‌లు తెచ్చుకునే పరిస్థితి లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏమీ తినకుండా ఉండాలంటే కష్టంగా ఉంటోంది. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే చాలా బాగుంటుంది.

- వినయ్‌కుమార్, సీఈసీ ద్వితీయ, చంద్రగిరి



ఒకరోజు తింటే.. మరో రోజు పస్తు

ప్రతి రోజూ ఇంటి నుంచి భోజనం తెచ్చుకోలేం.దీంతో మధ్యాహ్నం ఒకరోజు తింటున్నాం.. మరో రోజు పస్తు ఉంటున్నాం. డబ్బులు ఉంటే హోటళ్లలో తినేది, లేదంటే మానుకునేది. ఆకలేసినా మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు ఉండక తప్పదుకదా.



- ఎం. సూర్యాచారి, ఐసీఎస్ఈ ఒకేషనల్, చంద్రగిరి

62 కళాశాలల్లో 23వేల మంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో 62 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఏటా సుమారు 23 వేలమంది విద్యార్థులు ఇంటర్ చదివేవారు. సాధారణంగా ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద,మధ్య తరగతి కుటుంబాలు, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతుంటారు. కనీసం లంచ్ బాక్స్ తెచ్చుకోలేనివారు వీరిలో చాలామంది ఉంటారు. దీనికితోడు వీరు దాదాపు 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కళాశాలలకు వస్తుంటారు. దీంతో కళాశాల సమయంకంటే గంట, లేక రెండు గంటల ముందే ఇళ్లనుంచి బయల్దేరుతారు. అల్పాహారమో, లేక చద్దన్నమో తినేసి ఇళ్లనుంచి కళాశాలలకు చేరుకునే విద్యార్థులు మళ్లీ సాయంత్రం ఇళ్లకు చేరేవరకు ఆకలితోనే చదువులు సాగిస్తారు. ఇప్పుడు నారా లోకేష్ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి కావడంతో అటు విద్యార్థులతోపాటు ఇటు అధ్యాపకులు సైతం ప్రభుత్వంవైపు ఆశగా చూస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

ముదరంపల్లె సర్పంచి చెక్‌పవర్ రద్దు

పెద్దపంజాణి, ఆగస్టు 1: పెద్దపంజాణి మండలం ముదరంపల్లె సర్పంచి చెక్ పవర్‌ను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2017-18లో ముదరంపల్లెలో అదే గ్రామానికి చెందిన వేమారెడ్డి అంగన్వాడీ భవనం నిర్మించారు. ఈ భవనానికి ఉపాధి హామీ నుంచి రూ.1,74,789 మంజూరు చేసి సర్పంచ్ ఖాతాలో జమయ్యాయి. ఈ నిధులను సర్పంచ్ విత్‌డ్రా చేసి వేమారెడ్డికి ఇవ్వలేదు. దీంతో అయన హైకోర్టును ఆశ్రయించారు. నిజానిజాలను విచారించిన న్యాయస్థానం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులను వేమారెడ్డికి ఇవ్వాలని ఆదేశించినా, సర్పంచ్ ఖాతరు చేయలేదు. నోటీసును సైతం పోస్టులో తీసుకోకపోవడంతో చెక్ పవరు రద్దు చేశారు.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. కుప్పంలో 19.0మి.మీ, బైరెడ్డిపల్లి 16.4, శాంతిపురం 9.6, గుడుపల్లి 6.8, నగరి 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో జూలై సాధారణ వర్షపాతం 103.9 మి.మీ కురవాల్సి ఉండగా, 13.6 శాతం లోటుతో 89.8 మి.మీ మాత్రమే కురిసింది.

టమోటా ధరల పతనం



పలమనేరు, ఆగస్టు 1: పలమనేరు మార్కెట్ యార్డులో వారం రోజులుగా టమోటా ధరలు పతనమవుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా నెల రోజుల క్రితం రూ.800 ధరపలికిన 15కిలోల టమోటా బాక్సు.. గురువారం రూ.420కి పడిపోయింది. గత వారం రోజులుగా ఇవే ధరలు ఉన్నట్లు రైతులు తెలిపారు. పెరిగిన వ్యవసాయ ఖర్చుల కారణంగా ఒక ఎకరా టమోటా సాగు చేయాలంటే రూ.4లక్షలనుంచి 5లక్షల వరకు వ్యయమవుతోందని రైతులు అంటున్నారు. కనీసం కిలో రూ.35నుంచి రూ.40 వరకు ధర లేకుంటే తాము నష్టపోవాల్సి వస్తోందన్నారు. అనంతపురం జిల్లాలో విస్తారంగా టమోటా సాగుచేయడంతో అక్కడి రైతులు కూడా ఇక్కడి మార్కెట్లకు టమోటాలను తరలిస్తున్నారని, అంతేకాక టమోటా అధికంగా వినియోగించే చెన్నై, విజయవాడ, తిరుపతి, నెల్లూరు పట్టణాలకు కూడా టమోటాలు పొరుగు జిల్లాల నుంచి వస్తున్నందున ధరలు క్రమేపి పడిపోతున్నాయని వ్యాపారులు అంటున్నారు. చెన్నై పరిసర ప్రాంతాల నుంచీ టమోటా సాగు చేసి రైతులు చెన్నై మార్కెట్‌కు తీసుకు రావడం కూడా ధరల పతనానికి కారణమని తెలిసింది. ప్రభుత్వం టమోటా ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మా పంచాయతీని మాకు ఇప్పించండి

- ఎమ్మెల్యేని కోరిన చార్వాగానిపల్లి గ్రామస్తులు

పెనుమూరు, ఆగస్టు 1: 'గత ప్రభుత్వ హయాంలో తమ పంచాయతీని తమకు తెలియకుండా పెనుమూరులో కలిపారు. అప్పటి నుంచి మాకు ఏ పనులు జరగడంలేదు. ఇంటి బిల్లులు రావడంలేదు. ఉపాధి కూలి పని కూడా లేదంటున్నారు. కాస్త మా పంచాయతీని తిరిగి మాకు ఇప్పించండి సారూ' అంటూ పెనుమూరు మండలం చార్వాగానిపల్లి పంచాయతీ వాసులు ఎమ్మెల్యే థామస్‌కు మొరపెట్టుకున్నారు. గురువారం ఆయన మండలంలోని చార్వాగానిపల్లి సచివాలయంలో పింఛన్ల పంపిణీకి హాజరవగా.. ఈ సమస్యను స్థానికులు ప్రస్తావించారు. ఎంపీడీవోను పిలిచి చార్వాగానిపల్లి రిజల్యూషన్ ఇచ్చి తిరిగి పంచాయతీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం పెంచిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను ఆయన పంపిణీ చేశారు.

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపుపై కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: ఎన్నికల దృష్ట్యా ఆరునెలల పాటు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్ళిన 31 మంది తహసీల్దార్లు జిల్లాకు తిరిగివచ్చారు. కలెక్టరేట్‌లో గత నాలుగు రోజులుగా రిపోర్టు చేస్తున్నారు. వీరిలో రిటైర్డ్ కానున్న వారు తప్ప మిగిలిన వారికి కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాలకు కేటాయిస్తారు. దీనిపై కలెక్టరేట్‌లో కసరత్తు జరుగుతోంది. కాగా, తమకు అనుకూలంగా అధికార పార్టీ నాయకులు తహసీల్దార్లను నియమించుకుంటూ ఉంటారు. అయితే కూటమి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలతో అనుకూల అధికారుల విషయంలో కొంతవరకు సమస్యగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన నియోజకవర్గంలో పోస్టింగ్స్ ఇవ్వడం కుదరదని చెప్పింది. ఇక సొంత రెవిన్యూ డివిజన్‌లో కూడా పోస్టింగ్స్ ఇవ్వరాదని నిబంధన పెట్టింది. దీంతో ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా తహసీల్దార్లను అధికార పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరిన వారిని జిల్లా యంత్రాంగం నియమిస్తోంది. అన్ని నియోజకవర్గాల నుంచి మండలాలవారీగా ప్రతిపాదనలు, తిరస్కరణల జాబితా కలెక్టరేట్‌కు చేరింది. గురువారం ఉదయం నుంచి రాత్రివరకు కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, తిరుపతి జిల్లా పెంచలకిషోర్, డ్వామా పీడీ రాజశేఖర్‌లతో కలిసి పోస్టింగ్స్ ఇచ్చే జాబితా తయారీపై కసరత్తులు సాగిస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి దుర్మరణం



ట్రాక్టరు కింద పద్మనాభరెడ్డి మృతదేహం

పెనుమూరు, ఆగస్టు 1: ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందిన ఘటన పెనుమూరు మండలం సీఆర్‌కండ్రిగ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సీఆర్‌కండ్రిగకు చెందిన చిన్నమరెడ్డి కుమారుడు పద్మనాభరెడ్డి(47) గురువారం పొలంలో ట్రాక్టరుతో దుక్కిదున్ని తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో ట్రాక్టరు అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో బోల్తాపడింది. ట్రాక్టర్ తిరగబడటంతో.. ఆ ట్రాక్టర్ కింద పద్మనాభరెడ్డి చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టీడీపీ కార్యకర్తనని డెయిరీల్లో పాలు తీసుకోవడంలేదు

దారి, మురుగునీరు వెళ్లకుండా చేస్తున్న వైసీపీ నేతలు ● ప్రాణహాని ఉందంటూ బాధితుల ఆవేదన



చిన్నరెడ్డెప్ప, మంగమ్మ

పుంగనూరు, ఆగస్టు 1: 'తెలుగుదేశం పార్టీ కార్యకర్తనని తమ గ్రామంలో డెయిరీలకు పాలు తీసుకోవడం లేదు. ఇంటికి దారి, మురుగునీటి సమస్యలతో వైసీపీ నేతలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు' అంటూ పుంగనూరు మండలం బండ్లపల్లెకు చెందిన బి.చిన్నరెడ్డెప్ప గురువారం వాపోయారు. వివరాలిలా ఉన్నాయి. బండ్లపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప 35 ఏళ్లుగా టీడీపీ కార్యకర్తగా ఉన్నారు. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పర్యటన సందర్భంగా పుంగనూరులో జరిగిన గొడవల కేసులో పోలీసులు అరెస్టు చేసి జిల్లా జైలులో 74 రోజులు రిమాండ్‌లో ఉంచారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పుంగనూరు టీడీపీ నేతలు బండ్లపల్లెకు వెళ్లారు. దీంతో చిన్నరెడ్డెప్ప తమ ఆవుల ద్వారా వచ్చే 12 లీటర్ల పాలను డెయిరీకి పోయడానికి తీసుకెళ్లగా ఏజెంట్ తీసుకోలేదు. సర్పంచ్ సునీత, వైసీపీ నాయకులు గురివిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి ఇబ్బందులు పెట్టారు. గ్రామానికి ఐదు పాల డెయిరీలు తరఫున పాలు సేకరిస్తున్నా వైసీపీ నేతల బెదిరింపుల వల్ల ఎవరూ తమ పాలు తీసుకోలేదని ఆయన వాపోయారు. 'ఐదు కిలోమీటర్ల దూరం నడచి పుంగనూరుకు వెళ్లి పాలు అమ్ముకున్నాను. నేను ఒక్కడినే పుంగనూరుకు పాలు తీసుకెళ్లలేక కొత్తకోట, అంకుతోటపల్లెలో డెయిరీలకు పాలు పోశాను. మా ఇంటి నుంచి వర్షం, వ్యర్థపు మురుగు నీరు వెళ్లకుండా వైసీపీ నేత శ్రీనివాసులురెడ్డి గ్రామకంఠం స్థలంలో మట్టి తోలారు. మరో వైపు దారి లేకుండా రేకులతో ఆవుల షెడ్డు నిర్మించారు. గ్రామంలో వైసీపీ శ్రేణులు అత్యధికంగా ఉండటంతో మాతో ఎవరూ మాట్లాడకుండా ఆంక్షలు విధించి బెదిరించారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రం వద్ద నన్ను వైసీపీ నేతలు కొట్టారు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వైసీపీ వారు తమను చంపేస్తారని భయంతో ఇద్దరు ఆడపిల్లలు బెంగళూరులో చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవిస్తున్నట్లు చిన్నరెడ్డెప్ప భార్య మంగమ్మ తెలిపారు. తమకు ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని గత నెల 25వ తేది పుంగనూరు సీఐ జయరామయ్య, తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయలేదన్నారు. కాగా కొద్దిరోజులుగా ఓ ప్రైవేటు డెయిరీ తనకు ప్రస్తుతం వస్తున్న 6లీటర్ల పాలు కోసం క్యాన్ ఇచ్చారని చెప్పారు. ఈవిషయంపై గురువారం పుంగనూరు సీఐ జయరామయ్య గ్రామానికి వెళ్లి విచారించారు. తమకు దారి, మురుగునీటి సమస్య తీర్చాలని బాధితులు కోరగా, రేకుల షెడ్డు స్థలానికి తమ వద్ద డాక్యుమెంట్లు ఉన్నాయని, చిన్నరెడ్డెప్ప ఇంటికి వెళ్లేందుకు దారి ఉందని, ఎవరూ వారిని భయపెట్టలేదని గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆయన కోరారు.

నైపుణ్యాభివృద్ధి ప్రణాళికలను రూపొందించండి



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 1: జిల్లాలో యువతకు ఉపాధి కల్పించే దిశగా జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి, డీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. టెన్త్,ఇంటర్,డిగ్రీ, డిప్లమా, ఇంజినీరింగ్ కోర్సులు చేసిన నిరుద్యోగులను గుర్తించి, వారికి అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ కన్వీనర్, డీఆర్డీఏ పీడీ తులసి, డీఐసీ జీఎం చంద్రశేఖర్, రీజనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్‌మోహన్, జిల్లా అధికారి గుణశేఖర్, ఎల్డీఎం హరీష్ పాల్గొన్నారు.

అక్టోబరు 30లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద చేపట్టిన 22,125 ఇళ్ల నిర్మాణాలను అక్టోబరు 30వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన హౌసింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ఇళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి పురోగతి దిశగా తీసుకురావాలని చెప్పారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తల్లిపాల వారోత్సవాలను గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే లాభాలను ఆరోగ్యశాఖ కార్యకర్తలు గ్రామాల్లో వివరించాలన్నారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో తల్లిపాల వారోత్సవాలను డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి ప్రారంభించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారిణి నాగశైలజ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదుకు పోలీసుల మీనమేషాలు

- సీఎంను కలిసిన క్వారీ యజమాని

పలమనేరు, ఆగస్టు 1: పలమనేరు మాజీ ఎమ్మెల్యేపై తాను ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోక పోవడంతో ముఖ్యమంత్రిని కలిసి చెప్పానని క్వారీ యజమాని జనార్దననాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడ పలమనేరు మండలం మాదిగబండ వద్ద ఉన్న తన క్వారీని లీజుకు తీసుకొన్నారని జనార్దన నాయుడు తెలిపారు. తనతో చేసుకొన్న ఒప్పందం మేరకు లీజు డబ్బులుచెల్లించక పోగా, చెల్లని చెక్కులు ఇచ్చారన్నారు. దీనిపై తాను కేజీఎఫ్ కోర్టులో కేసుకూడా వేశానన్నారు. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోవడం.. వెంకటేగౌడ ఓటమి చెందటంతో తాను తన క్వారీని స్వాధీనం చేసుకొనేందుకు నిర్ణయించుకొన్నానని చెప్పారు. ఈ విషయం పసిగట్టిన వెంకటేగౌడ తన వాహనాలను అక్రమంగా తరలించుకుపోయాడని ఆరోపించారు. దీనిపై తాను జూన్ 8వ తేది పలమనేరు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా వెంకటేగౌడపై ఫిర్యాదు చేశానన్నారు. వైసీపీకి విధేయులుగా ఉన్న ఇక్కడి పోలీసు అధికారులు ఇప్పటికీ తన ఫిర్యాదుపై కేసు నమోదు చేయలేదన్నారు. తనను రెండుసార్లు స్టేషన్‌కు పిలిపించి బుజ్జగింపు మాటలు మాట్లాడి పంపేశారన్నారు. దీంతో ఈవిషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి ఫిర్యాదు చేశానన్నారు. తనకు న్యాయం చేస్తానని హామీ ఆయన ఇవ్వడంతో పాటు ఈవిషయమై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారని తెలిపారు.

మెడికల్ షాపులోనే వైద్యం

సెలైన్ బాటిల్ పోతుండగానే వృద్ధుడి మృతి ● డీఎంహెచ్‌వో తనిఖీ చేసిన రెండో రోజే ఘటన



మెడికల్‌షాపులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న దుర్గాదేవి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 1: గంగాధరనెల్లూరులోని ఎస్వీ మెడికల్స్ అనే మందుల షాపులో అనుమతులు లేకుండా రోగులకు వైద్యం చేస్తున్నారని రెండు రోజులకు ముందు డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ హెచ్చరికలను ఏ మాత్రం లెక్క చేయని నిర్వాహకులు.. మళ్లీ వైద్యం మొదలు పెట్టారు. అలా గురువారం వేల్కూరు వీపీ అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్ముగంరెడ్డి(60)కి మెడికల్ షాపులోనే వైద్యులు సూదిమందు వేసి సెలైన్ బాటిల్ పెట్టారు. సెలైన్ పోతుండగా ఆ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో వైద్యాధికారులు డాక్టర్ దుర్గాదేవి, ప్రవీణ్‌కుమార్ అక్కడకు వెళ్లారు. అనుమతులులేని మందుల షాపులో వైద్యం చేస్తూ ఒక వ్యక్తి మరణానికి కారణంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వెంటనే ఆ క్లీనిక్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసి మూయించేశారు. సదరు మెడికల్‌షాపు యజమాని మృతుడి బంధువులకు నచ్చచెప్పి మృతదేహాన్ని తరలించారు. దీనిపై ఎవరూ కేసు పెట్టకపోవడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 1: జిల్లా బాలల పరిరక్షణ విభాగం, శిశు విహార్‌లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ నాగశైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొటెక్షన్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషియల్ వర్కర్(మహిళ), అకౌంటెంట్, డేటా అనలిస్ట్ అవుట్ రీచ్ వర్కర్, పార్టు టైమ్ డాక్టర్ పోస్టుల్లో ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రెండు ఆయా పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. వన్‌స్టాప్ సఖి కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, లాయర్, పర్సనల్ పేరా మెడికల్, సోషియల్ కౌన్సిలర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల్లో ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రెండు మల్టీ పర్పస్ స్టాఫ్ పోస్టులకు, రెండు సెక్యూరిటీ గార్డు(మహిళ)లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. పోషణ అభియాన్ పథకం కింద జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ, ప్రాజెక్టు కార్యాలయాల్లో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పీడీ తెలిపారు. డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ 01(జనరల్), డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు అసిస్టెంట్ 01(జనరల్), బ్లాక్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్లుగా 01(బంగారుపాళ్యం-ఎస్సీ), పలమనేరు(ఓసీ)01, బైరెడ్డిపల్లె(బీసీ-ఏ) 01, శాంతిపురం01(ఓసీ), కుప్పం 01(ఎస్టీ), పుంగనూరు(ఓసీ)01 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 3 నుంచి 10వ తేదీలోపు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కార్యాలయం, రెండవ అంతస్తు, కలెక్టరేట్, చిత్తూరు అనే చిరునామాకు దరఖాస్తులను అందించాలని కోరారు. దరఖాస్తులు http\\chittoor.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో పొందాలని కోరారు.

పలువురు సీఐల బదిలీ

చిత్తూరు, జూలై 1: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారంతా రెండు రోజుల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. డీటీసీలో ఉన్న శ్రీనివాసరావును చిత్తూరు ఈస్ట్ సర్కిల్‌కు, ఈస్ట్ సర్కిల్‌లో ఉన్న కుళ్లాయప్పను వీఆర్‌కు, కల్లూరు సీఐ కట్టి శ్రీనివాసులును వీఆర్‌కు, డీసీఆర్‌బీలో ఉన్న జయరామయ్యను చిత్తూరు వన్‌టౌన్‌కు, వన్‌టౌన్‌లో ఉన్న విశ్వనాథరెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు.

తుపాకీతో గాయపరచిన వ్యక్తికి మూడేళ్ల జైలు



కోర్టు వద్ద గోవిందస్వామి

చిత్తూరు లీగల్, ఆగస్టు1: తుపాకీతో ముగ్గురిని గాయపరచిన వ్యక్తికి చిత్తూరు న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. బంగారుపాళ్యం మండలం సీజేఎఫ్ఎస్ కాలనీకి చెందిన గోవిందస్వామి 2020 అక్టోబర్ 4వ తేదీన తన కొడుకు, కోడలు, అల్లుడితో గొడవపడి వారిని తుపాకీతో కాల్చాడు. ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గోవిందస్వామిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం ఏఎస్‌జే కోర్టులో వాయిదా ఉండగా పూర్వాపరాలు పరిశీలించిన పిదప నేరం రుజువు కావడంతో అతనికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెన్నెల తీర్పు చెప్పారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం



కల్లూరు, ఆగస్టు 1: పులిచెర్లలో గురువారం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పురస్కరించుకొని పింఛన్ లబ్ధిదారులతో కలిసి చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ధనంజయనాయుడు, సర్పంచ్ రాణెమ్మ, టీడీపీ నాయకులు స్టుడియో రమణ, సదాశివరెడ్డి, శీను, చిన్నబ్బ, పెద్దబాబు, రామచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టుమ్యాన్ జలీల్ సేవలు మరువలేనివి



వి.కోట, ఆగస్టు 1: తపాలాశాఖలో అంకిత భావంతో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న పోస్టుమ్యాన్ జలీల్ సేవలు మరువలేనివని పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. 46 ఏళ్లపాటు తపాలా శాఖలో పనిచేసి పదవీ విరమణ సేసిన ఆయనను సహ చర ఉద్యోగులు, పోస్టల్ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోస్టుమాస్టర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాన్ని పరిశీలించిన అధికారులు

శాంతిపురం, ఆగస్టు 1: రాళ్లబూదుగూరు కోదండరామస్వామి ఆలయాన్ని దేవదాయశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అందులో భాగంగా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్నలక్ష్మీ, స్థపతి పరమేశ్వరప్ప, డీఈ.శ్రీనివాసులు, ఏఈ ఆనంద్ ఇతర అధికారులు, స్థానిక టీడీపీ నేతలతో కలిసి రాళ్లబూదుగూరు ఆలయాన్ని, కర్లగట్ట ధర్మరాజులు ఆలయాన్ని పరిశీలించారు. ఆలయాలను నూతనంగా నిర్మించడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని తెలియజేశారు. వారి వెంట టీడీపీ నాయకులు యూనిట్ ఇన్‌చార్జి మణి, చంద్రశేఖర్, రుద్రప్ప, కుమార్, జయరాజ్, బసవరాజు, సురేష్, వాజీద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీతో పండుగ వాతావరణం

కుప్పం, ఆగస్టు 1: పెంచిన పింఛన్ల పంపిణీతో రాష్ట్ర వ్యాప్తంగా పేద, నిరుపేద వర్గాల్లో పండుగ వాతావరణం ఏర్పడిందని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. కుప్పంలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి గని, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకిర్, టీడీపీ సీనియర్ మైనారిటీ నాయకులు సర్దార్‌బాషా, అన్సర్ బాషా, ముజీబ్ ఉస్మాన్, అంజత్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై టీడీపీ కౌన్సిలర్ల సమీక్ష

కుప్పం, ఆగస్టు 1: కుప్పం పురపాలక సంఘంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై టీడీపీ నుంచి గెలిచిన 6 మంది వైసీపీ కౌన్సిలర్లు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో సమీక్ష జరిపారు. కమిషనర్ ఛాంబర్‌లో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ వానా కాలం వచ్చినందున పారిశుధ్య కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని కమిషనర్‌ను కోరారు. తరచూ కాలువలు శుభ్రం చేయిస్తుండాలని, చెత్త వీధుల్లో పేరుకుపోకుండా తీయించాలని సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను జేసీబీలు పెట్టి శుభ్రం చేయించాలన్నారు. దోమలు, వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు కస్తూరి వేలు, జాకిర్, సోము, సురేశ్, సెల్వం పాల్గొన్నారు.

మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కలిసిన చల్లాబాబు



రొంపిచెర్ల, ఆగస్టు1: రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగ నూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి కలిశారు. గురువారం అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలంలో పెన్షన్లు పంపిణీలో ఉండగా మంత్రితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం పుంగనూరు నియోజక వర్గంలోని సమస్యలపై ఇరువురు కలిసి చర్చించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి అన్నారు.

పారిశుధ్య పనుల పట్ల నిర్లక్ష్యం తగదు: డీపీవో

సోమల, ఆగస్టు 1: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీపీవో లక్ష్మీ తెలిపారు. గురువారం కందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆమె పర్యటించి పారిశుధ్యం పనులను తనిఖీ చేశారు. డంపింగ్ యార్డులోని చెత్త నిల్వలతో వర్మీకంపోస్టు తయారు చేసి పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచుకోవాలని చెప్పారు. అనంతరం సచివాలయంలోని ఉద్యోగులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమంపై ఆరా తీశారు. నెల్లిమంద, కామిరెడ్డివారిపల్లె, తమ్మినాయనపల్లె పంచాయతీల్లో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శులు జయశంకర్, నాగభూషణం, లోకేశ్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

శాంతిపురం, ఆగస్టు 1: రోడ్డు ప్రమాదంలో గాయపడి కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతిచెందాడు. మంగళ వారం రాత్రి కుప్పం నుంచి వి.కోట వైపు వెళుతున్న లారీ గుండిశెట్టిపల్లె వద్ద రోడ్డుదాటుతున్న గుర్తుతెలియని మాటలురాని (మూగ) వ్యక్తిని ఢీకొంది. అప్పటి నుంచి ఆయన చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచారు. శుక్రవారం బంధువులు ఎవరైనా వస్తే అప్పగిస్తామని లేనిపక్షంలో అనాథగా భావించి అంత్యక్రియలు జరిపించనున్నారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరులో 97.21 శాతం పింఛన్ల పంపిణీ



గొబ్బిళ్లకోటూరులో పెన్షన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు, ఆగస్టు1 : నియోజకవర్గంలో గురువారం 97.21 శాతం మంది పింఛన్లు పంపిణీ చేశారు. నియోజక వర్గంలో మొత్తం 44948 మందికి గాను 43697 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు.

చౌడేపల్లె: మొదటి రోజే 97 శాతం పింఛన్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి పేర్కొన్నారు. తీసుకోని వారికి శుక్రవారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

సదుం: మండలంలో ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది, లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

రొంపిచెర్ల: మండలంలో 4,736 మంది పెన్షనర్లు ఉండగా 4502 మందికి పంపిణీ చేసి 95 శాతం ఇచ్చినట్లు ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు.

బైరెడ్డిపల్లె: సచివాలయ, రెవిన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ మిట్టకురప్పల్లెలో పంపిణీచేశారు.

98 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి

కుప్పం, ఆగస్టు1: కుప్పం పురపాలక సంఘంలో మొదటి రోజైన గురువారం సామాజిక పెన్షన్ల పంపిణీ 98 శాతం పూర్తయింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావుతోపాటు సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి ఆయా ప్రాంతాల్లోని టీడీపీ నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డు కొత్తపేటలో టీడీపీ బూత్ కన్వీనర్ కె.మణి, పార్టీ అధ్యక్షుడు లోకేశ్, ప్రధాన కార్యదర్శి భరత్, నాగరాజు, సంఘమిత్ర ప్రసాద్‌తో కలిసి పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

రామకుప్పం, ఆగస్టు 1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా సంఘమిత్రలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జీ మునిరత్నం కోరారు. గురువారం రామకుప్పంలో వారు సంఘమిత్రల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీఎం లావణ్య, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న కేఎన్ కురవపల్లి గ్రామస్తులు



రొంపిచెర్ల, ఆగస్టు1: మండలంలోని బోడిపాటివారిపల్లె పంచాయతీ కేఎన్ కురవపల్లిలోని 20 కుటుం బాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. గురువారం స్వామిని దర్శనం చేసుకున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే పాదయాత్ర చేయాలని గతంలో మొక్కుకున్నారు. కోరిక నెరవేడంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సహకారంతో శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవుల లోకేశ్వర్, మురళీ, రాజమణి, సిద్ధులు, శ్రీనివాసులు, కేశవులు, అమరనాథ్ తదితరులు వెళ్లారు.

కాళభైరవేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కల్లూరు, ఆగస్టు 1: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ జాంద్రపేటలో వెలసిన మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం కాళభైరవేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అర్చకులు మల్లేష్ భరద్వాజ్ శాస్త్రోక్తంగా పూజా కైంకర్యాలు నిర్వహించారు. కురవపల్లికి చెందిన గాయత్రి యాదగిరి దంపతులు తమ సొంత నిధులతో ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందయ్య, రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై హెచ్‌ఎంలకు అవగాహన

సదుం, ఆగస్టు 1: ఈ నెల 8వ తేదీన జరగనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణపై మండలంలోని హెచ్‌ఎంలకు ఎంఈవో శ్రీరాములు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఓటింగ్‌తో ఎన్నికలు జరుగుతాయని ఆయన తెలిపారు.

పింఛన్ల పంపిణీకి పొలంబాట

సోమల, ఆగస్టు 1: మండల టీడీపీ నాయకులు సచివాలయ ఉద్యోగులతో కలసి గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పొలాల వద్దకు సైతం వెళ్లి పింఛన్లు అందజేశారు. మిట్టపల్లెలో టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, గన్నావారి పల్లెలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు, గట్టువారిపల్లెలో జన సేన మండల అధ్యక్షుడు నాగభూషణం, పెద్దఉప్పర పల్లెలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, ఇరికి పెంటలో శ్రీని వాసులు నాయుడు, సోమలలో వెంకటరత్నం, శివశంకర్, మహేంద్రబాబు పాల్గొన్నారు.

పేదరికం లేని కుప్పం కోసం శ్రమిద్దాం



మాట్లాడుతున్న కడా ప్రాజెక్టు అధికారి వికాస్ మర్మత్

గుడుపల్లె, ఆగస్టు 1: సీఎం చంద్రబాబు లక్ష్యం పేదరికం లేని కుప్పమని ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కడా ప్రాజెక్టు అధికారి వికాస్ మర్మత్ అధికారులను కోరారు. గురువారం శ్రీశక్తి భవనంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబంలో ఆదాయ వనరుల పెంపునకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అధికారులు ఇంటింటా సర్వే చేయాలన్నారు. ప్రతి కుటుంబం సంపాదన వివరాలు ఉండాలన్నారు. ప్రతి కుటుంబంలోని పిల్లలకు విద్య, వైద్యం అందాలన్నారు. రైతులకు ఆదాయం వచ్చే పంటలను వేయడానికి అధికారులు తగిన సూచనలు చేయాలని వాటికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ప్రతి ఇంటికీ కరెంటు, కొళాయి, సామాజిక మరుగుదొడ్డి ఉండాలన్నారు. నియోజకవర్గంలో పెద్ద పరిశ్రమలు కూడా త్వరలో ఏర్పాటు కానున్నట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పేదరికం నిర్మూలన లక్ష్యం కోసం అధికారులు ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపి, ఏవో సురేష్, అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, ఆగస్టు 1: రెస్కో రామకుప్పం విభాగం పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, కొత్లపల్లెబాబు, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణలు కోరారు. గురువారం మండల సచివాలయం సమావేశ మందిరంలో జరిగిన రెస్కో అధికారులు, సిబ్బంది పరిచయ సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో పలుచోట్ల విద్యుత్‌తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతుండటం వల్ల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని, ఆ సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు.పలు గ్రామాల్లో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు, హెచ్‌వీడీఎస్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగల సమస్యను వెంటనే సరిష్కరిస్తామని రెస్కో విభాగాధికారి సుధాకర్ తెలిపారు. బల్ల, కృష్ణానగర్, ముద్దనపల్లె, చెల్దిగానిపల్లెకు కొత్త సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని, మిగిలిన గ్రామాల్లో కూడా సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అవసరమైన ప్రతి చోట హెచ్‌వీడీఎస్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు..?

పలమనేరు, ఆగస్టు1 : పలమనేరులో మోడల్ మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రతిపాదనలు పంపనున్నట్లు సమాచారం. 2019లో ప్రస్తుత ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మంత్రి హోదాలో పలమనేరు సమీపంలోని కేటిల్ ఫారం వద్ద 33 ఎకరాల స్థలాన్ని వెటర్నరీ యూనివర్సిటీ నుంచి సేకరించి మోడల్‌మార్కెట్ కమిటీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రూ. 8.37 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో యార్డు నిర్మాణం అటకెక్కింది. ప్రస్తుతం మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో మోడల్ మార్కెట్ యార్డు నిర్మాణానికి సేకరించిన భూమికి ఇవ్వాల్సిన రూ.40 కోట్ల పరిహారం మొత్తాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ఆ నిధులు వర్సిటీకి చెల్లించేశారు. అంతేగాక యార్డు నిర్మాణానికి రూ.40 కోట్లతో మార్కెటింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు వేశారు. తొలుత యార్డుకు తొలుత కావలసిన రోడ్డు, డ్రైనేజి, మరుగు దొడ్ల నిర్మాణకి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి మళ్లీ పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది. మౌలిక వసతులు కల్పించిన తర్వాత యార్డు లోపల మండీల నిర్మాణం ఆయా మండీ యజమానులే అధికారులు ఇచ్చిన ప్లాన్ మేరకు నిర్మించుకొనేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. మొత్తం మీద ఎట్టకేలకు అటకెక్కిన యార్డు నిర్మాణం మళ్లీ కార్యరూపం దాల్చుతున్నందున రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సోమలలో రాజస్థాన్ వ్యవసాయ బృందం పర్యటన



సరస్వతీపురంలో ప్రకృతి వ్యవసాయ సాగుపద్ధతులను పరిశీలిస్తున్న రాజస్థాన్ బృందం

సోమల, ఆగస్టు 1: ప్రకృతి వ్యవసాయం సాగు పరిశీలనకు రాజస్థాన్‌కు చెందిన బృందం గురువారం సోమల మండలంలో సందర్శించింది. అటల్ భుజల్ యోజన కింద ఏడుగురు వ్యవసాయ రాష్ట్రస్థాయి అధికారులు, రైతులతో కూడిన బృందం పలు తోటలను పరిశీలించారు. సరస్వతీపురంలోని రామిశెట్టి మహేశ్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో లిల్లీ పూల తోటలో 22 రకాల మొక్కలను, పలురకాల ఫల వృక్షాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో కషాయాల వినియోగం, వాటి తయారీ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం సాగుతో దిగు బడులపై రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కందూరు పంచాయతీలోని రామకృష్ణ, కామిరెడ్డివారిపల్లెలోని కవిత పొలాలను సందర్శించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులు శ్రీనివాసులు, కృష్ణారావు, ఎన్ఆర్‌వో తీమాటిక్ లీడ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, గురుప్రసాద్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివి రాణించాలి



పుస్తకాలు అందజేస్తున్న కోటీశ్వరరావు

సోమల, ఆగస్టు 1: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన కమిటీ అధ్యక్షుడు కొల్లా కోటేశ్వర రావు ఆకాంక్షించారు. గురువారం కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను, నోట్ బుక్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ గంగాధరం నాయుడు, అధ్యాపకులు గౌతం, శివయ్య, వెంకట సుబ్బయ్య, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సామరస్యంగా నిర్వహించుకోవాలి

సోమల, ఆగస్టు 1: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను సామరస్యంగా నిర్వ హించుకోవాలని ఎంఈవోలు శ్రీరాములు, శివరత్నమ్మ తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో ఓటర్ల జాబితాల ప్రదర్శన, ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. హైస్కూల్ హెచ్‌ఎంలు కుసుమాంబ, విద్యావతి, హరినాథ్, రాధాకృష్ణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



కల్లూరు, ఆగస్టు 1: పులిచెర్ల మండలం ఎల్లంకి వారి పల్లికి చెందిన తాళ్లూరి మనోహర్ నాయుడు పెన్షన్ లబ్ధిదారుడు. ప్రస్తుతం అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందు తున్నాడు. ఈ విషయం తెలుసు కున్న జేఎల్ఎం వెంకటేష్ స్విమ్స్‌కు వెళ్లి ఆయనకు పింఛను అందజేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా కృష్ణవేణి



చౌడేపల్లె, ఆగస్టు1: ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోఆర్డీగా పని చేస్తున్న కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో శివ ప్రసాద్ ఉద్యోగ విరమణ పొందడంతో ఈవోఆర్డీగా పనిచేస్తున్న ఆమెను ఇన్‌చార్జిగా నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

పుంగనూరులో 98.07 శాతం పింఛన్ల పంపిణీ

పుంగనూరు, ఆగస్టు 1: పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం 98.07 శాతం వివిధ రకాల పింఛన్లు లబ్ధిదారులకు అందజేసినట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు రూరల్‌లో 98 శాతం అందజేశామని ఎంపీడీవో మునిరెడ్డి తెలిపారు.

ఘనంగా పవిత్రోత్సవాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 1: పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామి వారికి టీటీడీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా పవిత్రోత్సవాలు జరిగాయి. టీటీడీ అర్చకులు హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, సమేత స్వామివారికి స్నపన తిరుమంజనం చేపట్టారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

న్యాయమే గెలిచింది: ఎమ్మార్పీఎస్



కుప్పంలో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కుప్పం, ఆగస్టు1: ఆలస్యమైనా న్యాయమే గెలుస్తుందని ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నిరూపించిందని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు అన్నారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో కుప్పంలో గురువారం వారు బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, సీనియర్ నాయకుడు దేవరాజ్, మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి డీకేపల్లె మురుగేశ్, శాంతిపురం మండలం సీనియర్ నాయకులు పాపన్న, రవీంద్ర, మహిళా అధ్యక్షురాలు శాంతి, సోషల్ మీడియా అధ్యక్షుడు సతీశ్, వీణ, శిల్ప, చిన్న ఓబులు, జయరాం, రాఅ, గంగాధరం పాల్గొన్నారు.

సోమల: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో సోమల బస్టాండ్‌లో ఎమార్పీఎస్ నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, రామనాథం, ప్రభుకుమార్, ప్రకాశ్, రవి కుమార్, శివరాం, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

వి.కోట: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శంకరప్ప, సంపంగి, సోమశేఖర్, వెంకటరమణ, చంద్రప్ప, సోము తదితరులు ఉన్నారు.

రామకుప్పం: రామకుప్పంలో వివిధ పార్టీలకు చెందిన మాదిగ నేతలు, ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషను సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామచంద్ర, సతీష్, జనసేన నేతలు మంజు, శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్, వెంకటేష్, గోవింద, జయప్ప, రమేష్, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కల్లూరు, ఆగస్టు 1: తల్లిపాలే బిడ్డకు అన్నింటికన్నా శ్రేయస్కరమని డాక్టర్ జానకీరావు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందిరానగర్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వలన తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రావన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవ పోస్టర్లతో ర్యాలీ నిర్వహించారు.

కుప్పం: పీఈఎస్‌లోని చిన్నపిల్లల విభాగంలో తల్లిపాల వారోత్సవాలను ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్యం ప్రారంభించారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్, కమ్యూనిటీ విభాగాధిపతి డాక్టర్ చిత్ర నాగరాజు పాల్గొన్నారు.

సోమల: అంగన్వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం పట్టణ వీధుల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ జరిపారు. సూపర్‌వైజర్ హరిత, వైద్య అధికారులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: చిన్న పిల్లలకు తల్లి పాలు ఔషధంలా పనిచేస్తాయని ప్రాథమిక వైద్యాధికారి డాక్టరు దినేష్‌కుమార్, ఆరోగ్యవిస్తరణాధికారి రాజేశ్వరి పేర్కొన్నారు. ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సదుం: సదుంలో చెరుకువారిపల్లె సీహెచ్‌సీ వైద్యులు డా.చరణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ● చెరుకువారిపల్లె పరిధిలోని పాఠశాల పిల్లలకు కంటి ఆరోగ్య ప్రాథ మిక పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, జానకి, శిఖామణి, ఆరోగ్య సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె అంగన్వాడీ కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ విజయచందర్, సీడీపీవో మాధవీలత గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు కామాక్షి, మంగమ్మ, ఆశాకార్యకర్తలు జయమ్మ, మొబీనా, విమలమ్మ పాల్గొన్నారు. ● మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గడ్డూరు గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

కుప్పం రూరల్: ఎన్.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్‌రాజా ఎన్.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు, అక్కడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, నూలుకుంట గ్రామంలో గర్భిణులతో, తల్లులతో, విద్యార్థులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ వనజాక్షి, ముత్తు, ఏఎన్ఎం గౌతమి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









పీఈఎస్‌లో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రమణ్యం, పుంగనూరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారి, బైరెడ్డిపల్లెలో ర్యాలీ, ఎన్.కొత్తపల్లెలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుభాష్‌రాజా

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సమస్యల పరిష్కారానికే 'డయల్ యువర్ ఎమ్మెల్యే'

చిత్తూరు, ఆగస్టు 1: నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రతి గురువారమూ డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. గురువారం నగరపాలక కార్యాలయంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజలతో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి సమస్యలను నమోదు చేసుకున్నారు. వినతులను వందశాతం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత వారం అందిన 48 ఫిర్యాదుల్లో 27 పరిష్కరించగా 21 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ, ఇతర అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అరగొండలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నా తిథి భోజనం



తవణంపల్లె, ఆగస్టు 1: అరగొండ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రధాని మోదీ పిలుపు మేరకు టీడీపీ నాయకులు డొక్కా సీతమ్మ మధ్యాహ్నా తిథి భోజనం ఏర్పాటు చేశారు. అరగొండ ఫైమాగానికి చెందిన టీడీపీ నేత రఘుపతి తన సొంత నిధులతో విద్యార్థులకు కోడిగుడ్డు, పాయసం, లడ్డు, అరటి పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రంజిత్, వంశీ, శ్రీనివాసులు, చంద్ర, హరి, మోహన్, బాలచంద్ర పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

వెదురుకుప్పం, ఆగస్టు 1: అళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే థామస్ హామీ ఇచ్చారని తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం వెదురుకుప్పం వచ్చిన ఎమ్మెల్యేతో చర్చించగా రూ.4లక్షలు మంజూరు చేయించారని చెప్పారు. ఈ నిధులతో సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

దీప కుటుంబానికి ఆర్థికసాయం



దీప చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 1: బలిజపల్లె కాలనీకి చెందిన దీప కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ ఆర్థికసాయం అందించారు. దీప ఆకస్మిక మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం ఆ కాలనీకి చేరుకుని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబీకులను పరామర్శించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, టీఎస్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, అనిల్, చంద్రబాబురెడ్డి ఆయన వెంట ఉన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, ఆగస్టు 1: మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల 3, 4, 5 తరగతుల విద్యార్థులకు అదే పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకమరాజు గురువారం పలక, పెన్నులు, నోటు పుస్తకాలు, పెన్సిల్ అందజేశారు. హెచ్ఎం జ్ఞానప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేసిన దాత వెంకమరాజును నెహ్రూ యువజన సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి అభినందించారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేశులు, గోపి, విజయకుమార్, వరలక్ష్మి, లక్ష్మీపతి పాల్గొన్నారు.

వలంటీర్లు బియ్యం రాకుండా చేశారు

విజయపురం, ఆగస్టు 1: వలంటీర్లు తమకు రేషన్ బియ్యం రాకుండా చేశారని మండలంలోని మల్లారెడ్డి కండ్రిగకు చెందిన రవణమ్మ, సుశీలమ్మ డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. బియ్యం కోసం చౌక దుకాణానికి వెళితే 'మీరు మరణించిన కారణంగా రేషన్‌కార్డు రద్దు అయిందని' ఆన్‌లైన్‌లో మెసేజ్ వస్తోందని వాపోయారు. డీటీ స్పందిస్తూ లోపాన్ని గుర్తించి, బియ్యం పంపిణీ జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు జ్ఞాపిక అందిస్తున్న ఈవో వెంకటేశు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 1: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు విజయనగరానికి చెందిన నాగభూషణం గురువారం రూ.లక్ష విరాళంగా అందించారు. దాతకు ఈవో వెంకటేశు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విష్ణుష్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో సుడిగాలి సుధీర్



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 1: జబర్దస్త్ నటుడు, హీరో సుడిగాలి సుధీర్ గురువారం కుటుంబ సభ్యులతో కలసి కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు అయన్ను ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

గెస్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 1: పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్టు లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన జ్యోతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంతుశాస్త్రం, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు అర్హత కలిగిన వారు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం ఉత్తీర్ణత కలిగి, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. ఇతర వివరాలకు 89199 62288లో సంప్రదించాలని కోరారు.

మాంగాడులో ఘనంగా ప్రదోషకాల పూజలు

నగరి, ఆగస్టు 1: మండల పరిధిలోని మాంగాడులో నూతనంగా నిర్మించిన మార్కండేయ శివాలయంలో గురువారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఐదు ప్రదోష కాల సమయంలో నందీశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

నేడు మూడో శుక్రవార పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 1: నగరంలోని వివిధ ఆలయాల్లో మూడో శుక్రవారం పూజలు నిర్వహించనున్నారు. గిరింపేట దుర్గాంబ, సంతపేట కనకదుర్గ, గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

టీడీపీలోకి వైసీపీ కార్పొరేటర్



చిత్తూరు సిటీ, ఆగస్టు1: వైసీపీ 13వ డివిజన్ కార్పొరేటర్ ఎంసీ బాబు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కార్పొరేటర్ ఎమ్మెల్యేను సన్మానించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరానని బాబు అన్నారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నేతలు వెంకటేష్ యాదవ్, త్యాగరాజన్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : గురజాల



దొడ్డిపల్లెలో వికలాంగుడికి పింఛన్ సొమ్ము ఇస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు/చిత్తూరు రూరల్/ చిత్తూరు కల్చరల్, ఆగస్టు 1: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ మొత్తాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం ఆయన మూడవ డివిజన్‌లోని దొడ్డిపల్లెలో, చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును నేరుగా లబ్ధిదారులకు అందించారు. ఇదేస్ఫూర్తితో ప్రభుత్వం ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. టీడీపీ మూడో డివిజన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణన్, మేయర్ అముద, కమిషనర్ అరుణ, కో-ఆప్షన్ సభ్యులు నళిని, ఇతర నాయకులు పాల్గొన్నారు. కాగా నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం 10 గంటలకు 93 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 97 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని కమిషనర్ తెలిపారు. కాగా, దొడ్డిపల్లె సప్తకన్నికల అమ్మవారిని ఎమ్మెల్యే గురజాల దర్శించుకున్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

రూరల్ మండలం చెర్లోపల్లిలో వాటర్ ట్యాంకుల పెచ్చులు ఊడి నీరు కలుషితమవుతోందని గ్రామస్తులు కలెక్టర్, ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశారు. తిరుపతి-బెంగళూరు హైవే కింద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని, గ్రామంలో బోర్లు మరమ్మతుకు గురయ్యాయని, రిపేర్లు చేయాలని కోరారు.

ఆదరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటా



ఎమ్మెల్యే మురళీమోహన్‌ను గజమాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాని



బొమ్మసముద్రంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 1: పేదరికం నుంచి వచ్చిన తనను ఆదరించి ఎమ్మెల్యే చేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. పూతలపట్టు మండలం గోపాలపురం వద్ద ఆయన జన్మదిన వేడుకలను నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ బాక్సులను అందజేశారు. 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మురళీమోహన్ అన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, థామస్, నేతలు యువరాజు నాయుడు, గంగారపు గోపి, దొరబాబు చౌదరి, గిరిధర్ నాయుడు, ఎన్‌పీ జయప్రకాష్, వెంకటేశ్వర చౌదరి, మురార్జీ, అమర్నాథనాయుడు, చంద్రబాబు నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, లత, చిత్ర, ఇందిర, గణపతి నాయుడు, జయప్రకాష్, గంగారపు హరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 1: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఆయన కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు ఆయన్ను ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. అనంతరం ఎమ్మెల్యే బస్టాండ్ సర్కిల్‌లో భారీ కేక్ కట్ చేసి, అందరికీ పంచారు. టీడీపీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, నాయకులు హేమాద్రినాయుడు, నరసింహులునాయుడు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

మండలంలో గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బొమ్మసముద్రంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు మణినాయుడు, మాజీ జడ్పీటీసీ లత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళీమోహన్‌కి అభినందనలు

వెదురుకుప్పం, ఆగస్టు 1: పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పుట్టిన రోజును పురస్కరించుకుని వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ గురువారం అభినందనలు తెలిపారు.

వృద్ధుల సంక్షేమం కోసమే పింఛను పెంపు



ఎస్ఆర్‌పురంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం, ఆగస్టు 1: వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే కూటమి ప్రభుత్వం పింఛను పెంచిందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పేర్కొన్నారు. కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాయాల్సిన పనిలేదని, ఇళ్ల వద్దకే అందిస్తున్నామని చెప్పారు.

శ్రీరంగరాజపురం : 49.కొత్తపల్లెమిట్టలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పెన్షన్ పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజేంద్రన్, టీడీపీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, సూరిరెడ్డి, దాసరి జీవన్ కుమార్, గురునాథం, దాసరి సతీష్, బాబు నాయుడు, రవి, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని ఆముదాల పంచాయతీ రేణుకాపురం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపి నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, నాయకులు వాసు నాయుడు, శేఖర్‌రాజు, రవినాయుడు, అరుల్‌నాథన్, సాంబశివన్, ఎంపీడీవో రామనాథం రెడ్డి పాల్గొన్నారు.

అవినీతిని ప్రోత్సహించను.. సహించను

వెదురుకుప్పం, ఆగస్టు 1: అవినీతిని ప్రోత్సహించను.. సహించనంటూ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ స్పష్టం చేశారు. గురువారం వెదురుకుప్పం మండలం జక్కిదొనలో చౌకదుకాణాన్ని ఆయన ప్రారంభించారు. అవినీతి రహిత నియోజకవర్గంగా జీడీనెల్లూరును తీర్చిదిద్దుతానన్నారు. అలాగే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న, టీడీపీ నేతలు పి.మోహన్‌మురళి, నేసనూరు మునిచంద్రారెడ్డి, గాలి బాబునాయుడు, పోటుగారి గంగయ్య, గురుసాల కిషన్‌చంద్, బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బట్టే చాణిక్య ప్రతాప్, రజనీకాంత్, బీగాల రమేష్, సర్పంచ్ శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో బాగ్యస్వాములు కండి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 1: నిధులను సక్రమంగా వినియోగిస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో అందరం బాగస్వాములవుదామని ఎమ్మెల్యే థామస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అధికారులతో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ, డ్రైనేజీ పనులు, తాగునీరు, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టీడీపీ ఆరు మండలాల అధ్యక్షులు రుద్రయ్యానాయుడు, స్వామిదాస్, జయశంకర్‌నాయుడు, చెంగలరాయయాదవ్, లోకనాథరెడ్డి, జనసేన నేత యుగంధర్ పాల్గొన్నారు.

అభ్యర్థులను మార్చడం వల్ల ఓడిపోయాం
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 1: 'చంద్రబాబు, పవన్‌లు ఎన్నికలో వారి సామాజిక వర్గాలను ఓన్ చేసుకున్నారు. జగన్ తన సామాజిక వర్గాన్ని కొంత వరకు పట్టించుకోకపోవడం వల్ల ఎన్నికల్లో నష్టం జరిగింది. ఎన్నికల సమయంలో అభ్యర్థులను మార్చడం కూడా ఓటమికి కొంత కారణం' అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖ మంత్రిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎలాంటి దర్యాప్తునకు ఆదేశించినా తాను సిద్ధంగా ఉన్నానని.. చంద్రబాబు పెట్టిన బ్రాండ్లనే తాము కొనసాగించామన్నారు. ప్రమోషన్లు, బదిలీల్లో నారాయణ స్వామికి డబ్బులు ఇచ్చామని ఎక్కడ చెప్పినా తాను ఉరేసుకుని చస్తానని అన్నారు.

ఒకటో తేదీనే పింఛను

వెదురుకుప్పం, ఆగస్టు 1: జక్కిదొనలో పెన్షన్‌దారులకు డబ్బులు ఎమ్మెల్యే థామస్ చేతుల మీదుగా అందించారు. ఇనాంకొత్తూరు గ్రామ పంచాయతీ అయ్యన్నగారిపల్లెలో టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునిచంద్రారెడ్డి, మొండి వెంగనపల్లెలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్ మురళి, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, దేవళంపేటలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రికుమార్ పెన్షదారులకు డబ్బులను అందజేశారు.

ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ విచారణ



వెదురుకుప్పం, ఆగస్టు 1: బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ తెల్లగుండ్లపల్లెకు చెందిన రామమూర్తిపై సోమవారం ప్రభుత్వానికి అందిన ఫిర్యాదు మేరకు గురువారం వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో మంగళ లేదా బుధవారం విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు ఇస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ జయంత్‌కుమార్ ఉన్నారు.

95శాతానికి పైగా పింఛన్ల పంపిణీ



నగరి ఆగస్టు 1: నియోజకవర్గంలో గురువారం 95శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వడమాలపేట మండలం కాయం గ్రామంలో పెన్షన్ల పంపిణీని ప్రారంభించగా నియోజకవర్గ పరిధిలో టీడీపీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు.

నేడు డైట్‌లో ఫ్రెషర్స్ డే

కార్వేటినగరం, ఆగస్టు 1 : స్థానిక డైట్‌లో డీఎడ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. కొత్త విద్యార్థులకు స్వాగతం పలకనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం కీలకం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 1: విద్యార్థుల ఆరోగ్యం వారి భవిష్యత్తు విజయానికి కీలకమని ఎస్పీ మణికంఠ అన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సాయుధ దళాల కార్యాలయంలో సురక్ష ఆస్పత్రి వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్టీ, కంటి తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సురక్ష ఆస్పత్రి డాక్టర్ మురళీకృష్ణ, అపోలో ఆస్పత్రి ఏవో రామ్‌గోపాల్‌రెడ్డి, ఏఎస్పీ అరీఫుల్లా, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, సెబ్ ఏఎస్పీ సుబ్బరాజు, పోలీసు వెల్ఫేర్ డాక్టర్ లావణ్య, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పాలసముద్రం, ఆగస్టు 1: పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్‌లను ప్రిన్సిపాల్ హేమలత అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు వినాయకం, సూర్య, సుశీల, రమ్య పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు యువతే కీలకం



గుడిపాల, ఆగస్టు1: పార్టీ పటిష్ఠతకు యువతే కీలకమని బీజేపీ మండలాధ్యక్షుడు ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిమ్మాపల్లికి చెందిన మధును యువ మోర్చా మండలాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా సావర్కర్ ట్రస్టు అధ్యక్షుడు దేవరాజన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



వృద్ధులకు పింఛన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

గుడిపాల, ఆగస్టు 1: అర్హులందరికీ పెంచిన పింఛన్లను గురువారం నుంచే సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. తొలిరోజు 90శాతం పంపిణీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, లేవలేని స్థితిలో ఉన్న వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండల కార్యదర్శి చంద్రమోహన్ పాల్గొన్నారు.

సోమలలో రాజస్థాన్ వ్యవసాయ బృందం పర్యటన

సోమల, ఆగస్టు 1: ప్రకృతి వ్యవసాయం సాగు పరిశీలనకు రాజస్థాన్‌కు చెందిన బృందం గురువారం సోమల మండలంలో పర్యటించింది. అటల్ భుజల్ యోజన కింద ఏడుగురు వ్యవసాయ రాష్ట్రస్థాయి అధికారులు, రైతులతో కూడిన బృందం పలు తోటలను పరిశీలించింది. సరస్వతీపురంలోని రామిశెట్టి మహేశ్‌కు చెందిన లిల్లీ పూల తోటలో 22 రకాల మొక్కలను, పలు రకాల ఫల వృక్షాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో కషాయాల వినియోగం, వాటి తయారీ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం సాగుతో దిగు బడులపై రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సంధ్య





నింద్ర, విజయపురం మండలాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విజయపురం, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి విష్ణుప్రియ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం విజయపురం ఆరోగ్య కేంద్ర ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తాగించే ముర్రుపాలు టీకాతో సమానమని సూచించారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

వెదురుకుప్పం, ఆగస్టు 1: తల్లిపాల ప్రాధాన్యతను తెలియపరుస్తూ గురువారం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లెలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి హెల్త్ అసిస్టెంటు పి.కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు.

పోస్టర్ ఆవిష్కరణ

గుడి పాల, ఆగస్టు 1: తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని మండల వైద్యాధికారిణి సంధ్య, వసంతాపురం సర్పంచ్ రజినీ బాబు, ఎంపీటీసీ విజయలక్ష్మి అన్నారు. వసంతాపురం గ్రామ సచివాలయంలో గురువారం తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు తల్లిపాల ఉపయోగాలను వివరించారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

నింద్ర, ఆగస్టు 1: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం, పోషణ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల తెలిపారు. మండల పరిధిలోని కొప్పేడు దళితవాడలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శ్యామల మాట్లాడుతూ బిడ్డ పుట్టిన 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, 7వ నెల నుంచి తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. ఏఎన్ఎం చిత్ర, ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, ఎంఎస్‌కే కీర్తి పాల్గొన్నారు.